ఉల్లి రైతుకు కన్నీళ్లే..!

ఉల్లి పండించిన రైతుకు కన్నీళ్లే మిగులుతున్నాయి. ఉల్లినారు మడుల తయారీ నుంచి పంట చేతికొచ్చే వరకు రైతులకు కష్టాలు తప్పడం లేదు. పెట్టుబడి పెట్టి పంట చేతికొచ్చాక కొంతైనా లాభం లేకపోతుందా అని అనుకున్న రైతుల ఆశలు అడియాశలయ్యాయి. చేతికొచ్చిన పంట మార్కెట్‌కు తరలిస్తే పెట్టుబడులు కూడా రాని పరిస్థితి నెలకొంది.

- అమాంతంగా పడిపోయిన ధరలు
- రైతులకు మొండి చేయి చూపుతున్న దళారులు
- కొనుగోలు కేంద్రం కర్షకుల ఏర్పాటు చేయాలని డిమాండ్

చాపాడు: ఇటీవల కాలంలో మార్కెట్‌లో నిత్యావసర ధరలు బాగా పెరిగాయి. వీటిలో పాటు కూరగాయల ధరలు కూడా ఆశాజనకంగా ఉన్నాయి. అయితే మార్కెట్‌లో మంచి ధర ఉన్నప్పటికీ ఉల్లి రైతులు మాత్రం తీవ్రంగా నష్టపోతున్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు అమ్మకం దశకు వచ్చేసరికి ఉల్లి ధరలను దళారులు అమాంతం తగ్గించడంతో ఉల్లి రైతులు కుదేలవుతున్నారు. మైదుకూరు నియోజకవర్గ వ్యాప్తంగా గత మూడు వారాలుగా రైతులు ఉల్లి పంట నూర్పిళ్లు చేస్తున్నారు. దసరా పండుగ ముందు ఉల్లి పంట నూర్పిడి చేసిన రైతుల పాలిట శాపంగా వర్షం కురిసింది. ఇప్పుడేమో ధరలు అమాంతం తగ్గిపోయానని బాధిత రైతులు తీవ్రంగా వాపోతున్నారు.



విక్రయించేందుకు సిద్ధం చేసిన ఉల్లిగడ్డలు

దళారుల చేతివాటం

ఉల్లి ధరలు బహిరంగ మార్కెట్‌లో చుక్కలు చూపిస్తున్నాయి. కిలో ఉల్లి రూ.50 నుంచి 60వరకు ధర పలుకుతోంది. రైతుల వద్ద మాత్రం దళారులు క్వింటా రూ.1,500కు కొనుగోలు చేస్తున్నారు. సెప్టెంబర్ నెల చివరి వారంలో.. అక్టోబర్ మొదటి వారంలో ఉల్లి పంట నూర్పిడి చేసిన రైతులు క్వింటాల్ రూ.3,200 విక్రయించగా.. రెండో వారంలో క్వింటాల్ రూ.2,700 తగ్గింది. అక్కడి నుంచి క్రమంగా తగ్గుతూ ప్రస్తుతం రూ.1,500కు పడిపోయింది. దళారులు చేతివాటం ప్రదర్శిస్తుండడంలో ఉల్లి రైతు నష్టపోతున్నాడు.

దూర ప్రాంతాలకు వెళ్లినా నష్టాలే

మైదుకూరు నియోజకవర్గ పరిధిలోని సాగైన ఉల్లి పంటకు ఇక్కడ సరైన గిట్టుబాటు ధరల్లేక రైతులు ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నప్పటికీ అక్కడ కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మైదుకూరు నుంచి చెన్నై, తాడేపల్లిగూడెం ప్రాంతాలకు ఉల్లిగడ్డలను తీసుకెళ్లిన రైతులు అక్కడ కూడా నష్టాలు చవిచూస్తున్నారు. క్వింటాల్ రూ.500–1,000లోపే వ్యాపారులు అడుగుతున్నారని రైతులు వాపోతున్నారు.

కొనుగోలు కేంద్రాలు లేక నష్టాలు

నియోజకవర్గంలో ఉల్లి కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో ధరలు అమాంతం తగ్గిపోతున్నాయని రైతులు అంటున్నారు. నియోజకవర్గ పరిధిలోని మైదుకూరు, దువ్వూరు, ఖాజీపేట, బ్రహ్మంగారిమఠం మండలాల్లో రైతులు ఉల్లి పంటను విస్తారంగా సాగు చేస్తారు. 10 వేల ఎకరాలకు పైగా ప్రతి ఏటా ఉల్లి పంటలు సాగుతాయి. ఈ క్రమంలో మైదుకూరు ప్రాంతంలో ఉల్లి కొనుగోలు కేంద్రాలు లేకపోవటంతో దళారులు తమకు ఇష్టం వచ్చినట్లు కొనుగోళ్లు చేస్తున్నారని, ఇప్పటికైనా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తే మేలు జరుగుతుందని రైతులు అంటున్నారు.

ఉల్లి రైతులను ఆదుకోవాలి



ఎకరా పొలం కౌలుకు తీసుకుని ఉల్లి పంటను సాగు చేశాను. ఎకరా సాగుకు రూ.80 వేలు ఖర్చు అయింది. దిగుబడి బాగున్నప్పటికీ ధరలు అమాంతం తగ్గిపోయాయి. మైదుకూరులో విక్రయించేందుకు తీసుకెళ్లగా.. క్వింటా రూ.1,500 కూడా వ్యాపారులు అడగటం లేదు. ప్రభుత్వం చర్యలు తీసుకుని ఉల్లి రైతులను ఆదుకోవాలి. –కుమార్, ఉల్లి రైతు, నాగాయపల్లె, దువ్వూరు మండలం

క్లుప్తంగా

శ్రీవారికి వెండి కిరీటం వితరణ



స్వామివారికి వెండి కిరీటాన్ని అందజేస్తున్న మురళి కుటుంబ సభ్యులు

బద్వేలు అర్బన్: మున్సిపాలిటీ పరిధిలోని లక్ష్మీపాలెం గ్రామంలో వెలసిన శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలోని శ్రీవారి మూలవిరాట్‌కు రూ.1.50 లక్షలు విలువ చేసే వెండి కిరీటాన్ని లక్ష్మీపాలెం గ్రామానికి చెందిన కామసముద్రం మురళి కుటుంబ సభ్యులు వితరణ చేశారు. బుధవారం ఆలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కిరీటాన్ని ఆలయ ఈఓ, కమిటీ సభ్యులకు దాతలు అందజేశారు. ఇందులో భాగంగా దాతలకు స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు మెంటా అశోక్, కామసముద్రం హర్షబాబు, దేవాదాయశాఖ సిబ్బంది కొండయ్య, సాంబయ్య, రాజు, కామసముద్రం మురళి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

మాజీ సీఎం వైఎస్ జగన్‌ను కలిసిన రెడ్యం



మాజీ సీఎం వైఎస్ జగన్‌ను సన్మానిస్తున్న రెడ్యం వెంకటసుబ్బారెడ్డి తదితరులు

చాపాడు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు ఏపీఎస్ ఆర్టీసీ మాజీ జోనల్ చైర్మన్ రెడ్యం వెంకటసుబ్బారెడ్డి, కమలాపురం నియోజకవర్గానికి చెందిన కాశీభట్ల సత్య సాయినాథశర్మ బుధవారం మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని కలిశారు. పులివెందుల పర్యటనలో భాగంగా క్యాంపు కార్యాలయంలో మాజీ సీఎం వైఎస్ జగన్‌ను కలసి ఘనంగా సన్మానించారు. త్వరలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యవర్గ పదవుల్లో రెడ్యం, సాయికు పదవులు కల్పించనున్నట్లు మాజీ సీఎం వైఎస్ జగన్ ప్రకటించారు. వైఎస్సార్‌సీపీ అభివృద్ధి కోసం పనిచేయాలని, ఇదే క్రమంలో తమ నియోజకవర్గ పరిధిలోని కార్యకర్తలకు అండగా ఉండాలని, ప్రజల తరపున పోరాడాలని మాజీ సీఎం వైఎస్ జగన్ తమకు సూచించినట్లు రెడ్యం వెంకటసుబ్బారెడ్డి తెలియజేశారు.

9న లగోరి జిల్లా ఎంపికలు

మైదుకూరు: నవంబర్ 9న దువ్వూరు మండలం గుడిపాడులో లగోరి జిల్లా స్థాయి ఎంపికలు జరుగుతాయని లగోరి కార్యదర్శి ఈర్ల సంజీవరాయుడు, గుడిపాడు శంకరాచార్య విద్యామందిర్ కరస్పాండెంట్ మూలే రామ్మోహన్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. గుడిపాడులోని శంకరాచార్య విద్యామందిర్ మైదానంలో 9న ఉదయం 8.30 గంటలకు జరిగే ఈ ఎంపికల్లో అండర్ –14, అండర్ –17, 18 ఏళ్లు పైబడిన వయసు వారు పాల్గొనాలని కోరారు. ప్రతి టీంలో 10 మంది ఉండాలని తెలిపారు. ఎంపికల్లో పాల్గొనేవారు తమ ఆధార్‌తోపాటు రూ.50 రుసుం చెల్లించాలని పేర్కొన్నారు. వివరాలకు 8121945459, 8639614144 నంబర్లకు సంప్రదించాలని కోరారు.

భూ సమస్యలు పరిష్కరించుకోండి

కాశినాయన: రైతులు రీసర్వే జరిగిన భూముల్లో ఏవైనా తప్పులు ఉంటే గ్రామసభలో సరిదిద్దుకోవాలని డిప్యూటీ తహసీల్దారు రవిశంకర్ తెలిపారు. బుధవారం మండలంలోని పిట్టిగుంట గ్రామంలో రెవెన్యూ గ్రామ సదస్సు నిర్వహించారు. రీసర్వేలో ఏవైనా పొరపాట్లు జరిగి ఉంటే తమ దృష్టికి తీసుకవచ్చి సరిదిద్దుకోవాలన్నారు. కార్యక్రమంలో వీఆర్‌ఓ శ్రీకాంత్, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రేపు మైదుకూరులో జాబ్ మేళా

మైదుకూరు: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.నారాయణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడప్, ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజ్ వారి ఆధ్వర్యంలో నిర్వహించే ఈ జాబ్ మేళాలో డైకిన్ (ఏసీ మాన్యుఫాక్చరింగ్ కంపెనీ), కీర్తన ఫిన్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్, టోరే ఇండస్ట్రీస్ వంటి ప్రముఖ కంపెనీలు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తాయని పేర్కొన్నారు. మేళాలో 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ, పీజీ, డిప్లొమా అభ్యర్థులు పాల్గొనవచ్చునని తెలిపారు. ఇంటర్వ్యూలకు హాజరయ్యే అభ్యర్థులు సంబంధిత సర్టిఫికెట్లు, బయోడేటా, ఆధార్, పాస్‌పోర్టు సైజు ఫొటోలతో హాజరు కావాలని సూచించారు. మైదుకూరు, బద్వేలు పరిసర ప్రాంతాల నిరుద్యోగ యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు ఏపీఎస్ఎస్‌డీసీ కోఆర్డినేటర్ జి.శివకృష్ణ 9398348760 సెల్ నంబర్‌కు సంప్రదించాలని తెలిపారు.

నిబంధనలు పాటించాలి

ఖాజీపేట: దీపావళి పండగ నేపథ్యంలో టపాసులు విక్రయించే దుకాణదారులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని ఖాజీపేట సీఐ మోహన్ తెలిపారు. ఖాజీపేటలో టపాసుల దుకాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుకాణాదారులు ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. చిన్న పిల్లలను విక్రయ పనుల్లో ఉంచరాదన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

కమనీయంగా కల్యాణోత్సవం



కల్యాణోత్సవంలో గంగా గౌరి సమేత అగస్త్యేశ్వరస్వామి

ప్రొద్దుటూరు కల్చరల్: స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో బుధవారం మాస శివరాత్రి పర్వదినం సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వేకువ జామున అగస్త్యేశ్వరస్వామి మూల విరాట్‌కు మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రాజరాజేశ్వరిదేవికి పంచామృతాభిషేకం, కుంకుమార్చన చేసి ప్రత్యేకంగా అలంకరించారు. లోక కల్యాణార్థం గణపతి, నవగ్రహ, రుద్ర హోమాలను చేసి పూర్ణాహుతిని సమర్పించారు. సాయంత్రం గంగా గౌరి సమేత అగస్త్యేశ్వరస్వామి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి కాలక్షేపం మండపంలోని కల్యాణ వేదికపై ఆశీనులను చేశారు. వేద పండితులు వేదమంత్రోచ్చారణల మధ్య కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, ఈఓ రామచంద్రాచార్యులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధికి కలిసికట్టుగా కృషి చేద్దాం



మున్సిపల్ వైస్‌చైర్మన్ సాయికృష్ణను సన్మానిస్తున్న మున్సిపల్ చైర్మన్, కౌన్సిల్ సభ్యులు

బద్వేలు అర్బన్: బద్వేలు పట్టణాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేసేందుకు కలిసికట్టుగా కృషి చేద్దామని మున్సిపల్ చైర్మన్ వాకమళ్ల రాజగోపాల్‌రెడ్డి కోరారు. స్థానిక ఎన్‌జీఓ కాలనీలోని మున్సిపల్ కార్యాలయ సభాభవనంలో బుధవారం నిర్వహించిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా కౌన్సిల్ సభ్యులు, అధికారులు, సిబ్బంది సహకారంతో బద్వేలును సుందర పట్టణంగా తీర్చిదిద్దేందుకు కృషి చేద్దామని అన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో బద్వేలు మున్సిపాలిటీకి మంజూరు చేసిన రూ.130 కోట్ల నిధులలో 50 శాతం మేర పనులు పూర్తి చేయగలిగామని, మిగిలిన పనులను కూడా పూర్తి చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించే సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. పురపాలక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పెట్రోలు బంకులో హిందుస్థాన్ పెట్రోలియం కంపెనీ ప్రతినిధులు పంపిన పెట్రోలు, డీజిల్ ప్రారంభోత్సవం ఆలస్యం కావడంతో కొంత మేర అవిరైందని, అందుకు కారకులైన వారికి షోకాజ్ నోటీసులు అందజేయాలని అధికారులను ఆదేశించారు.

గళమెత్తిన కౌన్సిలర్లు: ఆయా వార్డుల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని వార్డు కౌన్సిలర్లు అధికారుల దృష్టికి తీసుకుపోయారు. 19వ వార్డు పరిధిలోని భాకరాపేట దళితవాడలో గత రెండు నెలలుగా తాగునీటి సమస్య ఉందని, అధికారులు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ వైస్‌చైర్మన్ గోపాలస్వామి సమావేశం దృష్టికి తీసుకురాగా తక్షణమే సమస్యను పరిష్కరించాలని ఇంజినీరింగ్ అధికారులను కమిషనర్ ఆదేశించారు. ఎన్‌జీఓ కాలనీలో శ్మశాన స్థలాన్ని ఆక్రమిస్తున్నారని అధికారుల దృష్టికి తీసుకువచ్చినా అధికారులు స్పందించడం లేదని 21వ వార్డు కౌన్సిలర్ ఓబుల్‌రెడ్డి సమావేశం దృష్టికి తీసుకురాగా తక్షణమే వెళ్లి పరిశీలించాలని టౌన్ ప్లానింగ్ అధికారులను కమిషనర్ ఆదేశించారు.

వైస్‌చైర్మన్‌కు సన్మానం: పురపాలక సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తోన్న పెట్రోలు బంకు ఏర్పాటులో కీలకపాత్ర పోషించిన మున్సిపల్ వైస్‌చైర్మన్ ఆర్.వి.సాయికృష్ణను మున్సిపల్ చైర్మన్, మున్సిపల్ కమిషనర్, కౌన్సిలర్లు సన్మానించారు. మున్సిపల్ కమిషనర్ వి.వి.నరసింహారెడ్డి, డీఈ సుమన్‌రెడ్డి, ఏఈలు, ఆయా వార్డుల కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ప్రజలకు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ దీపావళి శుభాకాంక్షలు



ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి ఎమ్మెల్యే డాక్టర్ సుధ

అట్లూరు: బద్వేలు నియోజక వర్గ ప్రజలు, ప్రజా ప్రతినిధులు అధికారులకు బద్వేలు ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. చీకటిపై వెలుగు, చెడుపై మంచి, అజ్ఞానంపై జ్ఞానం సాధించిన విజయానికి దీపావళి పండుగ ప్రతీక అని, శాంతి, సౌభ్రాతృత్వం, సామరస్యాలతో కూడిన సమాజాన్ని నిర్మించేందుకు ఇలాంటి పండుగలు మనకు స్ఫూర్తినిస్తాయని పేర్కొన్నారు. దీపావళి దీపాల కాంతి మనందరిలోనూ వెలుగులు నింపాలని వారు ఆకాంక్షించారు. ఈ దీపావళి పర్వదినం ఆయురారోగ్య అష్టైశ్వర్యాలతో పాటు సుఖ సంతోషాలు నింపాలని కోరుకుంటున్నట్లు తెలిపారు.

అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న డీఎస్పీ భక్తవత్సలం

ప్రొద్దుటూరు క్రైం: విధి నిర్వహణలో ప్రాణాలను కోల్పోయిన పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మణీయమని, వారిని స్మరించుకోవడం మనందరి బాధ్యత అని డీఎస్పీ భక్తవత్సలం అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా బుధవారం జిల్లా ఆస్పత్రిలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని డీఎస్పీ ప్రారంభించారు. సీఐ యుగంధర్‌తో పాటు పలువురు సిబ్బంది, పోలీసు అధికారులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు. జిల్లా ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఆనంద్‌బాబు రక్తదాన శిబిరాన్ని పర్యవేక్షించారు.

3న వనభోజన మహోత్సవం

ప్రొద్దుటూరు కల్చరల్: తొగటవీర క్షత్రియుల వనభోజన మహోత్సవాన్ని 3వ తేదీన నిర్వహించనున్నట్లు తొగటవీరక్షత్రియ కల్యాణ మండప అధ్యక్షుడు బండారు రఘురామయ్య తెలిపారు. బుధవారం కల్యాణమండపంలో వనభోజన మహోత్సవానికి సంబంధించిన ఆహ్వాన పత్రాలను ఆవిష్కరించారు. 11 ఏళ్లుగా కల్యాణ మండప కమిటీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని రఘురామయ్య పేర్కొన్నారు.

శైవ క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు



మాట్లాడుతున్న ఆర్టీసీ డిపో మేనేజర్ మల్లికార్జునరెడ్డి

ప్రొద్దుటూరు: కార్తీక మాసాన్ని పురస్కరించుకుని రాష్ట్రంలోని పలు ముఖ్యమైన శైవ క్షేత్రాలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సు సర్వీసులను ఏర్పాటు చేసినట్లు ప్రొద్దుటూరు ఆర్టీసీ డిపో మేనేజర్ ఎ.మల్లికార్జునరెడ్డి తెలిపారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ ప్రొద్దుటూరు నుంచి అమరావతి, భీమవరం, ద్రాక్షారామం, పాలకొల్లు, సామర్లకోట, పంచారామాలు, పిఠాపురం కుక్కుటేశ్వరస్వామి ఆలయాలకు సూపర్‌లగ్జరీ బస్సులను ఏర్పాటు చేసి రూ. 2,700 నిర్ణయించినట్లు వివరించారు. ప్రతి ఆదివారం సాయంత్రం 4 గంటలకు డిపో నుంచి బస్సు బయలు దేరుతుందన్నారు. ప్రొద్దుటూరు నుంచి కన్యతీర్థం, నయనాలప్పకోన, యాగంటి, నందవరం, మహానంది క్షేత్రాలకు ఎక్స్‌ప్రెస్ బస్సును ఏర్పాటు చేసి రూ.500 చార్జీ నిర్ణయించామని పేర్కొన్నారు. ప్రతి సోమవారం ఉదయం 5 గంటలకు డిపో నుంచి ఈ బస్సు బయల్దేరుతుందని, ఆన్‌లైన్‌లో టికెట్ బుక్ చేసుకోవచ్చని తెలిపారు. ప్రొద్దుటూరు నుంచి మహానంది, ఓంకారం, శ్రీశైలం, త్రిలింగదర్శనం క్షేత్రాలకు బస్సు సౌకర్యం ఏర్పాటు చేశామని, ఎక్స్‌ప్రెస్ సర్వీసుకు రూ.1,000 టికెట్ ఉంటుందన్నారు. ప్రతి ఆదివారం రాత్రి 8 గంటలకు అరుణాచలంకు రూ.1,250తో సూపర్‌లగ్జరీ బస్సును ఏర్పాటు చేసిట్లు తెలిపారు.

ఉద్యోగుల సేవలు అభినందనీయం



చాపాడు ఎంపీడీఓ కార్యాలయంలో బదిలీపై వెళ్లిన సన్మాన గ్రహీతలతో ఎంపీపీ, ఎంపీడీఓ, అధికార యంత్రాంగం

చాపాడు: మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపించిన మండల పరిషత్ ఉద్యోగుల సేవలు అభినందనీయమని ఎంపీపీ తెలిదేల లక్షుమయ్య కొనియాడారు. ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా మండల పరిషత్‌లో పని చేసిన ఎంపీడీఓ శ్రీధర్ నాయుడు, సీనియర్ అసిస్టెంటు రామకృష్ణ, జూనియర్ అసిస్టెంటు మధుసూదన్, టైపీస్టు హయతున్నీసా, పంచాయతీ కార్యదర్శులు భాగ్యలక్ష్మీ, ధనేశ్వర్‌బాబు, సురేష్, ధనుంజయబాబు, అటెండర్ జాఫర్‌లు బదిలీ అయ్యారు. ఈ క్రమంలో వీరికి వీడ్కోలు పలుకుతూ.. చాపాడు ఎంపీడీఓగా వచ్చిన వీర కిషోర్‌కు స్వాగతం పలుకుతూ.. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సన్మాన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గత ఐదేళ్ల కాలంలో మండల పరిషత్ అధికార యంత్రాంగం మండల అభివృద్ధి కోసం బాగా పని చేశారన్నారు. ఎంపీడీఓ శ్రీధర్ నాయుడు గ్రామ సచివాలయ వ్యవస్థలతో అన్యోయంగా ఉంటూ అన్ని గ్రామ పంచాయతీలను అభివృద్ధి పథ నడిపించారని ప్రశంసించారు. ప్రస్తుత ఎంపీడీఓ కూడా మండలాన్ని అన్ని విధాల అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకోవాలని తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఓ రామానుజం, ఈఓపీఆర్డీ రాధా కృష్ణవేణి, మండల వ్యవసాయాధికారి మ్యాగీ, సీనియర్ అసిస్టెంటు విష్ణు, ఎంఈఓలు రవిశంకర్, వంశీకృష్ణ, పంచాయతీ కార్యదర్శులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

మండల సమావేశంలో అధికారులను ప్రశ్నించిన ఎంపీపీ, జెడ్పీటీసీ



సమావేశంలో మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ బాషా

పోరుమామిళ్ల: మండలంలో సమస్యలు కూడా అధికంగా ఉన్నాయని, వాటిని పరిష్కరించాలని వైస్ ఎంపీపీ సీఎం బాషా, జెడ్పీటీసీ ముత్యాల ప్రసాద్ డిమాండ్ చేశారు. బుధవారం సభాభవనంలో జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో వారు మాట్లాడుతూ గత సమావేశంలో చర్చించిన సమస్యలు, తీర్మానాలను అమలు చేయాలని తెలిపారు. పోరుమామిళ్ల చెరువు తూములు, పంటకాలువల మరమ్మతులు చేయలేదన్నారు. రంగసముద్రం పంచాయతీలో సర్వేనంబరు 227/2లో 15 ఏళ్ల క్రితం మాజీ సైనికుడికి ఇచ్చిన భూమి స్థానికులు ఆక్రమించుకున్నా రెవెన్యూ, పోలీసు అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. రైతులు ట్రాన్స్‌ఫార్మర్ల కొరకు డీడీలు కట్టి 6 నెలలవుతున్నా పట్టించుకోలేదని ప్రశ్నించారు. అలాగే మండలంలో ప్రైవేటు వ్యక్తులు ఇష్టారాజ్యంగా ఆర్‌ఓ ప్లాంట్లు ఏర్పాటు చేస్తూ దోసుకుంటున్నారని ఆరోపించారు. 50 పడకల ఆసుపత్రిలో రోగులకు సక్రమంగా సేవలందటం లేదన్నారు. రంగసముద్రం చెరువుకు వెళ్లే పంటకాలువలు కబ్జా కావడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారని, కబ్జాదారులపై రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు ఎందుకు చర్య తీసుకోవడం లేదని ప్రశ్నించారు. సమావేశంలో ఎంపీటీసీ క్రిష్టారెడ్డి మాట్లాడుతూ గానుగపెంట సచివాలయానికి యూరియా రావడం లేదన్నారు. మండల ఉపాధ్యక్షుడు చెన్ను రాజశేఖర్, ఎంపీడీఓ రమణారెడ్డి, తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

5న వెల్లాలలో వేలం పాట

రాజుపాళెం: మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వెల్లాలలోని శ్రీచెన్నకేశవ, సంజీవరాయ, భీమలింగేశ్వరస్వాముల ఆలయాలకు సంబంధించిన వేలం పాటలు నవంబర్ 5న మంగళవారం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ బీవీ నరసయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు వెల్లాలలోని కల్యాణ మండపం బాడుగకు (లీజుకు) ఇచ్చే వేలం పాట నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ వేలం పాల్గొనే వారు రూ.50 వేలు ధరావత్తు చెల్లించాలని, వేలం పాట దక్కించుకున్న వారు మూడేళ్ల పాటు నిర్వహించుకోవచ్చని తెలిపారు. కల్యాణ మండపానికి సంబంధించిన సప్లై డెకరేషన్ బహిరంగ వేలం నిర్వహించనున్నామని, ఇందుకుగాను రూ.లక్ష ధరావత్తు చెల్లించాలని, వేలంలో దక్కించుకున్న వారు మూడేళ్లపాటు వేసుకోవచ్చని పేర్కొన్నారు. ఆలయాలకు సంబంధించిన తలనీలాల వేలం పాట నిర్వహిస్తామని, ఇందుకుగాను ఈ వేలం పాటలో పాల్గొనేవారు రూ.లక్ష చెల్లించాలని, పాటను దక్కించుకున్న వారు ఏడాది పాటు తలవెంట్రుకలను పోగు చేసుకోవచ్చునని తెలిపారు. మధ్యాహ్నం 12 గంటలకు స్వాములకు సమర్పించిన వస్తువులను వేలం పాట వేయనున్నారని తెలిపారు. ఈ పాటలో పాల్గొనే పాటదారులు రూ.1,000 డిపాజిట్ చెల్లించాలని ఈఓ పేర్కొన్నారు.

4 నుంచి పత్తి కొనుగోళ్లు ప్రారంభం

ప్రొద్దుటూరు: నంద్యాలలో బీసీజీ కాటన్ ఇండస్ట్రీస్ వారి మిల్లులో నవంబర్ 4వ తేదీ నుంచి సీసీఐ వారు పత్తి కొనుగోలు చేస్తారని ప్రొద్దుటూరు వ్యవసాయ కమిటీ ప్రత్యేక శ్రేణి కార్యదర్శి పి.రత్నరాజు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో పత్తి పండించిన రైతులు తమ పత్తిని నంద్యాలలోని బీసీజీ కాటన్ ఇండస్ట్రీస్ వారి మిల్లుకు తీసుకెళ్లి విక్రయించుకోవచ్చునని ఆయన పేర్కొన్నారు. పత్తి పంటకు కనీస మద్దతు ధర పొడుగు పింజ క్వింటాలుకు రూ.7,521, పొట్టి పింజకు రూ.7,121లకు కొనుగోలు చేస్తారని తెలిపారు. రైతులు, కౌలు రైతులు తమ ఆధార్ కార్డు, పట్టాదారు పాస్‌పుస్తకం జిరాక్స్ కాపీలను తమ సమీపంలోని రైతు సేవా కేంద్రంలో వీఏఏల ద్వారా తమ పేర్లను రిజిస్టర్ చేయించుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 8884229387, 9182361171, 9704100670 సెల్ నంబర్లకు సంప్రదించాలని కోరారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించాలి

బద్వేలు అర్బన్: రాష్ట్ర వ్యాప్తంగా డిగ్రీ, ఇంజినీరింగ్, బి.ఫార్మసీ విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న రూ.3,480 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాహుల్, వీరపోగురవి పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం బద్వేలు తహసీల్దారు ఉదయభాస్కర్‌రాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువగళం పాదయాత్రలో అధికారంలోకి వస్తే నెల రోజుల్లో ఫీజు రీఎంబర్స్‌మెంట్ విడుదల చేస్తామని హామీ ఇచ్చిన విద్యాశాఖమంత్రి లోకేష్ ఇప్పుడు ఊసే ఎత్తకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి విద్యార్థులకు రావల్సిన ఫీజు రీఎంబర్స్‌మెంట్ స్కాలర్‌షిప్‌లు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ నాయకులు రాజేష్, తల్వార్, బన్ని పాల్గొన్నారు.

పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

మైదుకూరు: ఉద్యాన శాఖ అందించే పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉద్యాన శాఖ అధికారిణి సుభాషిణి పేర్కొన్నారు. వ్యవసాయ, ఉద్యాన శాఖల ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని వనిపెంటలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టమాటా, ఆయిల్ పామ్ సాగు కోసం రైతులకు ఉద్యాన శాఖ పలు పథకాల ద్వారా సహాయ సహకారాలు అందిస్తోందని తెలిపారు. మైదుకూరు మండల వ్యవాయాధికారిణి పి.లక్ష్మీప్రసన్న మాట్లాడుతూ ట్రైకోడెర్మా ఉపయోగాల గురించి వివరించారు. కేవీకే అధినేత, శాస్త్రవేత్త ఎం.బాలకృష్ణ విత్తనాలు, జీవన ఎరువుల ఉపయోగాల గురించి తెలిపారు. కేవీకే శాస్త్రవేత్తలు ఫిరోజ్ హుస్సేన్ అరటి, పసుపు పంటలను ఆశించే తెగుళ్ల వాటి నివారణ గురించి, శ్రీవిద్యారాణి టమాటా పంటను ఆశించే తెగుళ్ల నివారణ గురించి రైతులకు వివరించారు. అనంతరం మొక్క జొన్న పంటను సందర్శించిన అధికారులు కత్తెర పురుగు నివారణ చర్యలను రైతులకు వివరించారు. ఆదర్శ రైతులు ఓబయ్య, రామనందారెడ్డి, వెంకట్రామయ్య తదితరులు పాల్గొన్నారు.